క్లుప్తంగా

27న ఉప సర్పంచ్‌ల ఎన్నిక

మాడుగుల రూరల్: వివిధ కారణాలతో ఖాళీ అయిన గ్రామ ఉప సర్పంచ్‌ల ఎన్నిక ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి సూచనలతో మాడుగుల, కె.జె.పురం, కింతలి, పోతనపూడి గ్రామాల ఉప సర్పంచ్‌లు ఎన్నిక ఆ రోజు ఉదయం 11 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల అధికారులను కూడా నియమించామని ఆయన తెలిపారు.

పొలం గట్లపై పండ్ల మొక్కల పెంపకం

కె.కోటపాడు: రైతులు తమ పొలాల గట్లపై ఉద్యానవన పంటల్లో భాగంగా పండ్ల మొక్కలను నాటి అదనపు ఆదాయాన్ని ఆర్జించాలని కొరువాడ జగన్నాథపురం వ్యవసాయ శాఖ సహాయకుడు అప్పలనాయుడు కోరారు. మండలంలో 8 గ్రామాల్లో ఉద్యానవన పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలన్న కార్యచరణలో భాగంగా కొరువాడ జగన్నాథపురంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా అమ్మకాలు చేసుకోలేని రైతులు మార్క్‌ఫెడ్ ద్వారా విక్రయాలు చేసుకోవచ్చునని వివరించారు. సేంద్రియ విధానంలో పండించే పంటల కారణంగా భూమి సారవంతంగా మారడంతో పాటు మంచి ఆరోగ్యం, వాతావరణ సమతుల్యత కలుతుందన్నారు. గట్లపై అరటి, నిమ్మ, బత్తాయి, సపోటా, దానిమ్మ, పంపర పనస, జంబో నేరేడు, కొబ్బరి, కరివేపాకు, మునగ, మామిడి, ఉసిరి రకం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల రేవతి, రమేష్, ఉప సర్పంచ్ జి.అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రమజ్యోతి, జి.పోలినాయుడు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ కోసం నాయీ బ్రాహ్మణుల వినతి



వడ్డాదిలో విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నాయీ బ్రాహ్మణులు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించి ఆదుకోవాలని మండల నాయీ బ్రాహ్మణులు కోరారు. ఈ మేరకు వడ్డాదిలో విద్యుత్ శాఖ ఏఈ రాజుకు వినతి పత్రం అందించారు. ముందుగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల నాయీ బ్రాహ్మణులు సమావేశమయ్యారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్న ప్రభుత్వ వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు శేషు, శంకర్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిగురు అట్టలతో చీడపీడల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

చీడికాడ: వేరుశనగలో చీడపీడల నివారణకు జిగురు అట్టల వినియోగం మేలు చేస్తుందని ఎచ్చర్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు సూచించారు. శుక్రవారం వారు ఖండివరంలో రైతులకు వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్, టీవోటీ డాక్టర్ కిషోర్ పర్యవేక్షణలో గ్రామీణ వ్యవసాయం, పనిపై అవగాహన కల్పించారు. ఈ మేరకు వేరుశనగను ఆశించే తామర పురుగు నివారణకు జిగురు అట్టలు వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, విద్యార్థులు పి.మౌనిక, ప్రియాంక రెడ్డి, ఎం.లలితా అభిజ్ఞా, వి.అనూశ్రీ, జి.కృష్ణప్రియ, కె.మయూష పాల్గొన్నారు.

రూ.9.24 లక్షలకు మాడుగుల వారపు సంత వేలం



మాడుగులలో వారపు సంత వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

మాడుగుల: మాడుగుల పట్టణ వారపు సంత వేలం పాట శుక్రవారం మాడుగుల పంచాయతీ కార్యాలయంలో జరిగింది. ఈ వేలం పాటలో 21 మంది రూ. 2.50 లక్షలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. చివరికి గ్రామానికి చెందిన మామిడి కొండాజీ రూ.9.24 లక్షలకు పాటను దక్కించుకున్నారు. గతేడాది రూ.8.80 లక్షలకు పాట వెళ్లగా.. ఈ ఏడాది రూ.44 వేలు అదనంగా ఆదాయం వచ్చింది. పాటలో పాల్గొన్న వారికి తమ డిపాజిట్‌ను తిరిగి చెల్లించేసినటుట పంచాయతీ ఈవో మూర్తి బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, పంచాయతీ విస్తణాధికారి ఫతీష్, వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడి మురుగు అక్కడే.!



శరభవరం రోడ్డులో మదుము నిర్మాణ పనులు



బండారు వీధిలో వర్షపు నీటితో ఉన్న గృహాలు(ఫైల్)

పల్లెల్లో పూడుకుపోయిన కాలువలు

మురుగు, వర్షపు నీరు ప్రవాహానికి ఆటంకం

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రోలుగుంట: పల్లెల్లో పారిశుధ్యం క్షీణించింది. కాలువలు లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. వర్షపు నీరు సైతం ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. రోలుగుంట మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రోడ్లకు సరైన మదుములు, పక్క కాలువలు లేక ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో 24 పంచాయతీలున్నాయి. శావారు గ్రామాలు సుమారు 32 ఉన్నాయి. మండల కేంద్రం రోలుగుంట బీఎన్ రోడ్డు దారి పొడవునా మదుములు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రధాన వీధుల కూడలిలోని మదుముల నిర్మాణంపై అధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదు. దీంతో బండారు వీధి, యాతవీధి, అల్లువారి వీధి వర్షాలు పడితే చెరువును తలపిస్తున్నాయి. ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డులోని హనుమాన్ ఆలయం వద్ద బండారు వీధిలో బాందీ షాపు సమీపంలోను, ఎంపీపీ పాఠశాల సమీపంలోను, మండల కూడలి సమీపంలోని మదుములు, కాలువలు పూడికపోయాయి. చుక్కనీరు కూడా ఈ మదుముల ద్వారా పారే పరిస్థితి లేదు. మరోవైపు రెండు వారాలుగా బీఎన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా పొక్లెయిన్‌తో కాలువలు తీసి మెటల్‌తో నింపుతున్నారు. దీంతో రోడ్డు ఎత్తు పెరిగి వర్షాలు పడితే నీరు ప్రవహించే మార్గం లేక ఈ రోడ్డు పక్కన ఉన్న వీధులన్నీ చెరువును తలపించే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కాలువలు, మదుముల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షం పడితే చెరువే..



వర్షం పడితే బండారు వీధి చెరువును తలపిస్తోంది. కాలువలోను, మదుములోను పూడిక తీయక వాడుక నీరు, వర్షం నీరు పోయే మార్గం లేకుండా పోయింది. వర్షపు నీటిని మోటారుతో తోడించుకుంటున్నాం. అధికారులు స్పందించి కాలువలో పూడిక తీయించాలి.

– బండారు లక్ష్మి, బండారు వీధి, రోలుగుంట

మదుములు వదిలేసి రోడ్లు వేస్తున్నారు..



ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకొని ఉన్న మదుములు వదిలేసి రోడ్డు పనులు చేస్తున్నారు. దీంతో పూడికపోయి మదుముల నుంచి నీరు పోయే మార్గం ఉండదు. అధికారులు మదుముల పనులు కూడా చేయించి స్థానికుల సమస్య తీర్చాలి.

– శొంటాం సత్యవతి, కొండపాలెం గ్రామం

మదుముల పనులు చేసేందుకు చర్యలు

రోడ్డు నిర్మాణంతో పాటు ఆనుకుని ఉన్న మదుముల పనులు చేసేందుకు చర్యలు చేపతాం. ముందుగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పక్కన కాలువలు తీసి మెటల్‌తో పూడ్చుతున్నారు. మదుముల పనులు చేసే ఆలోచన ఉంది.

– నారాయణరెడ్డి, జేఈ, ఆర్అండ్‌బీ అధికారి, నర్సీపట్నం(డివిజన్)

త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలి

రోలుగుంట: స్థానిక పీఏసీఎస్‌లో త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని సభ్య రైతులు కోరారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో శుక్రవారం సీఏవో సభ్య రైతులతో సర్వసభ్య సమావేశం జరిగింది. పీఏసీఎస్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా, రుణాలు మంజూరు, జమల గురించి ముందుగా సీఈవో మహేష్ చదివి వినిపించారు. సభ్యులకు ఎకరా చెరకకు రూ.లక్ష, వరికి రూ.50వేలు రుణం మంజూరు చేస్తున్నామన్నామన్నారు. రుణాల మంజూరులో జాప్యం, ధాన్యం కొనుగోలు వద్ద తలెత్తుతున్న చిన్నపాటి సమస్యలు చర్చకు రాగా.. వాటి గురించి రైతుల సందేహాలను సీఈవో నివృత్తి చేశారు. ఇప్పటి వరకూ రుణం మంజూరుకు డిక్లరేషన్‌కు రూ.100 మాత్రమే తీసుకొని, కొత్తగా యూజర్ చార్జీ వసూలు చేసి సుమారుగా రైతు రుణం పొందడానికి అదనంగా రూ.500 చలానా కట్టించుకోవడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో రుణాలు మంజూరు శరవేగంగా జరిగేదని, రైతుల అవసరాలు వెనువెంటనే తీరేవని, ప్రస్తుతం కొంత అలస్యం జరుగుతుందని రైతులు సభకు దృష్టికి తీసుకెళ్లారు. సభకు అధ్యక్షత వహించిన పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి జగన్నాథరావు స్పందిస్తూ సమస్యలను తమ శాఖ ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, గోవిందరావు

నర్సీపట్నం: పట్టణంలో రద్దీ ప్రాంతాలైన ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం సైబర్ నేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై డివిజన్‌లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులంతా నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

నాతవరం: ప్రభుత్వం చేపట్టిన భూరీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం వెదురుపల్లి రెవెన్యూ గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయం వద్ద సర్పంచ్ కాళ్ల సరస్వతి సత్యనారాయణ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వెదురుపల్లి పంచాయతీలో మొత్తం 150 సర్వే నంబర్లలో 984 ఎకరాలు ఉందన్నారు. అందులో రైతులు 967 మంది ఉన్నారన్నారు. ముందుగా రైతులకు భూ రీసర్వేపై అవగాహన కల్పించామన్నారు. రైతులు తమ రికార్డులు పట్టుకుని రీసర్వే చేసే ప్రదేశానికి వచ్చి భూహద్దులు చూపిస్తే ఎలాంటి పొరపాటు జరగకుండారీ సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ శివ, మండల సర్వేయరు ప్రసాద్, గ్రామపెద్దలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లేటరైట్ తవ్వకాలతో గిరిజనులకు అన్యాయం



అసనగిరిలో గిరిజనులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం

నాతవరం: ఏజెన్సీలో లేటరైట్ నిక్షేపాలు తవ్వకాలు జరిపితే గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. మండలంలో సుందరకోట పంచాయతీ శివారు అసనగిరి గ్రామంలో శుక్రవారం సీపీఎం బృందం పర్యటించింది. లేట్‌రైట్ నిక్షేపాలు ఉన్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించి అసనగిరి గ్రామంలో గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ అసనగిరి ప్రాంతంలో లేటరైట్ తవ్వకాలు జరిపితే అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులు జీవితాలు అగమ్యగోచరంగా తయారవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం లేటరైట్ తవ్వకాలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తుందని, ఆప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తే గిరిజనులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు, తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యుడు లోతా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నాతవరం: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం కమ్యూనిటీ అభివృద్ధి కమిటీ సమావేశం సర్పంచ్ గొలగాని రాణి అధ్యక్షతన జరిగింది. పీహెచ్‌సీలో రోగులకు అందించే సేవలను ప్రసన్న వివరించారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు అపిరెడ్డి మాణిక్యం, బంగారు సూరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

నర్సీపట్నం: నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 346 మందికి వేసవి సెలవులు ఇచ్చే వరకు మజ్జిగ సరఫరా చేసేందుకు పట్టణానికి చెందిన పలువురు దాతలు ముందుకొచ్చారు. ఈ మేరకు దాతలు సుతాపల్లి శ్రావణ్ కుమార్, అల్లాడ సురేష్, కౌశిక్, హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ ఎంవీఎస్ఎస్ఎస్ మూర్తి శుక్రవారం విద్యార్థులకు మజ్జిగ అందజేశారు. ఉపాధ్యాయుడు ఐ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రోజు మజ్జిగ పంపిణీకి రూ.1000 ఖర్చు అవుతుందన్నారు.

చోడవరం వైస్ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

చోడవరం: చోడవరం మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నికకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. ముందస్తు ఒప్పందం ప్రకారం వైస్ ఎంపీపీ బుద్ధ గంగరాజు రాజీనామా చేయడంతో ఈ పదవికి ఎన్నికల అనివార్యమైంది. మండల పరిషత్‌లో 25 స్థానాలకు 19 స్థానాలు వైఎస్సార్‌సీపీకి ఉన్నాయి. దీంతో ఎంపీపీ, రెండు వైస్ ఎంపీపీలు ఆ పార్టీ వారే ఉన్నారు. అయితే ఇద్దరు వైస్ ఎంపీపీల్లో ముందస్తు ఒప్పందం ప్రకారం బుద్ధ గంగరాజు స్థానంలో వేరొకరికి ఇవ్వాల్సి రావడంతో ఆయన రాజీనామా చేశారు. దీంతో ఎన్నికల జరిపేందుకు నోటిఫికేషన్ ఇచ్చామని ఎంపీడీవో తెలిపారు. ఈ నెల 27న వైస్ ఎంపీపీ ఎన్నిక జరుగుతుందన్నారు. మెజార్టీ ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ వారే ఉండటంతో ఎన్నిక లాంఛనంగా మారనుంది.

'ప్రశ్నించే గొంతుకలపై దాడులు సరికాదు'

నర్సీపట్నం: ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేయటం సరికాదని ఆంధ్రప్రదేశ్ స్వేరో నెట్వర్క్ రాష్ట్ర కన్వీనర్ ఎం.చిట్టియ్య పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజుపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. దాడులను వ్యతిరేకిస్తూ వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో శనివారం కృష్ణాప్యాలెస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

పీ-4 సర్వేకు సహకరించాలి

దేవరాపల్లి: గ్రామాల్లో పీ-4 సర్వేను పక్కాగా నిర్వహించేందుకు సిబ్బందికి ప్రజలు సహకరించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు కోరారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో పీ-4 సర్వే పట్ల అవగాహన కల్పించేందుకు శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేలోని అంశాలు, ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. ఈ సమావేశంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు అన్నం సాంబమూర్తి, అన్నం రామునాయుడు, బొబ్బిలి రాము, కొప్పాక శంకరరావు, అన్నం శంకరరావు, కొమర బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం

దేవరాపల్లి: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే 'పోషణ్ బీ– పడాయి బీ'కార్యక్రమం లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతాయారు అన్నారు. ఈ మేరకు కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జరిగిన శిక్షణలో ఆమె మాట్లాడారు.అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలబాలికలకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలు, క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణ అమరవీరుల త్యాగఫలం

చీడికాడ: ఎస్సీల ఉమ్మడి వర్గీకరణ మాదిగ అమరువీరుల త్యాగఫలమని మాదిగ ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు అన్నారు. తురువోలులో శుక్రవారం ఆయన మాదిగ సంఘం నేతలతో కలిసి మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేశారని, ఆ పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలకు ఈ విజయం అంకితమన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో విజయోత్సవ సభ త్వరలో నిర్వహిస్తామన్నారు.

కొత్తకోటలో అభివృద్ధి పనులకు భూమి పూజ

రావికమతం: మేజర్ పంచాయతీ కొత్తకోటలో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ లోవరాజు, ఎంపీటీసీ సభ్యులు శంకర్ శుక్రవారం భూమి పూజ చేశారు. కాపులు దిబ్బ శివారు నుంచి బూరుగుమాను కట్టు వరకు రూ.6 లక్షలతో సిమెంట్ రోడ్డు, రూ.2 లక్షలతో బూరుగుమాను కట్టు దగ్గర, శ్మశానవాటిక వద్ద వెయిటింగ్ హాల్ నిర్మాణం పనులు చేస్తున్నట్టు సర్పంచ్ లోవరాజు తెలిపారు. అలాగే ఇటీవల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోరును నాయకులు ప్రారంభించారు.

నాతవరంలో నేడు ప్రజా వేదిక

నాతవరం: మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఉదయం ఉపాధి హామీ పథకం పనులపై ప్రజా వేదిక ఏర్పాటు చేశామని ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీలు ఈ నెల 3వ తేదీ నుంచి పంచాయతీలు వారీగా జరిగిందన్నారు. అనంతరం మండల కేందంలో ప్రజా వేదిన నిర్వహిస్తున్నామన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



తాటిపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి లీలాప్రసాద్, విద్యార్థులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వేములపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూష, సిబ్బంది



బుచ్చెయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్: ఈ నెల 24న జరిగే ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కె.జె.పురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తాటిపర్తిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో క్షయ వ్యాధి వ్యాప్తి, నివారణ గురించి విద్యార్థినులకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.లీలాప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీబీ యూనిట్ పర్యవేక్షకులు ఈశ్వరరావు, హెచ్‌వీ పుష్పకాంతం, ఏఎస్ఎం సువర్ణ కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, పాఠశాల హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములపూడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైద్యాధికారి డాక్టర్ అనూష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ టీబీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరికైనా వారం నుంచి దగ్గు, జ్వరం తగ్గకపోవటం, బరువు తగ్గడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఉమ్మ పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యాధికారిని సంప్రదించి మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు చక్రవర్తి, రాయ్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు మల్లిబాబు, రుక్మిణి, హోమియో డాక్టర్ దస్తగిరి, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో ఆరోగ్య సమస్యలు

బుచ్చెయ్యపేట: పొగాకు వినియోగంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, గ్రామీణ ప్రజలు పొగాకుకు దూరంగా ఉండాలని బుచ్చెయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు వెంకటకృష్ణ సూచించారు. ప్రపంచ క్షయ(టీబీ) దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు క్షయ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో పొలం పనులు చేసే మగ, ఆడ కూలీలకు ఎక్కువగా పొగాకు(చుట్ట కాల్చడం) అలవాటు ఉందన్నారు. అతిగా పొగ తాగే వారికి క్షయ వ్యాధి వస్తున్నట్లు గుర్తించారన్నారు. రెండు వారాలకంటే ఎక్కువగా కఫంతో కూడిన దగ్గు వచ్చిన, బరువు తగ్గడం, ఆయాసం ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి క్షయ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధికి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. సర్పంచ్ ఎస్.లక్ష్మి, సీహెచ్‌వో బి.దేడుడు, హెచ్ఎస్ త్రిమూర్తులు, ఏఎన్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

గుల్లేపల్లిలో చురుగ్గా కాలువ నిర్మాణం



గుల్లేపల్లిలో డ్రెయినేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ దేముళ్ళు

కె.కోటపాడు : గుల్లేపల్లిలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి యాదవుల నివాసాల వరకూ తలపెట్టిన కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో కాలువ లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయేది. దీంతో స్థానికులు మురుగుతో పడుతున్న ఇబ్బందులను స్థానిక సర్పంచ్ బండారు దేముళ్ల ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ దృష్టికి తీసుకెళ్లారు. మురుగునీటి సమస్య పరిష్కారానికి కాలువ నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులను జెడ్పీటీసీ అనురాధ మంజూరు చేశారు. ఈ నిధులతో 100 మీటర్ల డ్రైనేజీని పూర్తి నాణ్యతా ప్రమాణాలను పాటించి నిర్మిస్తునట్టు ఇంజినీరింగ్ అసిస్టెంట్ తేజ సాయి తెలిపారు. పనులను సర్పంచ్ శుక్రవారం పర్యవేక్షించారు.

రైతు మేళాను సద్వినియోగం చేసుకోండి


బుచ్చెయ్యపేట: గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు రీజనల్ ఫెయిల్ మేళా ఏర్పాటు చేసినట్లు కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడేలా ఈ మేళా ఏర్పాటు చేశారన్నారు. ఈ మేళాలో దక్షిణ భారతదేశంలో ఉన్న అన్ని విశ్వ విద్యాలయాలు, పరిశోధనా స్థానాల పరిధిలో ఉన్న శాస్త్రవేత్తలు పాల్గొని వ్యవసాయ రంగంపై తగిన సూచనలు, సలహాలు అందిస్తారన్నారు. అధిక పంటల దిగుబడి, వ్యవసాయ రంగం అభివృద్ధిపై సూచనలతో పాటు మేళాలో పలు రకాల పంటల సాగు, దిగుబడి దినుసుల ప్రదర్శన ఉంటుందన్నారు.

దేవరాపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌వోగా ఆనంద్



దేవరాపల్లి: దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సీహెచ్‌వోగా పి.ఆనంద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్బవరం పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన పదోన్నతిపై స్థానిక సీహెచ్‌వోగా విధుల్లో చేరారు. ఇక్కడ సీహెచ్‌వోగా పనిచేసిన పి.ప్రసాదరావు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీ ఏర్పడింది. దీంతో ఆయన ఇక్కడి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా నూతన సీహెచ్‌వో ఆనంద్ మాట్లాడుతూ వైద్యాధికారులు సూచనల మేరకు ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

బోదకాలు బాధితులకు వితరణ



బోదకాలు బాధితులకు సామగ్రి అందిస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు: క్యూలెక్స్ ఆడదోమ కాటు కారణంగా బోదకాలకు గురయ్యే పరిస్థితి ఉంటుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ తెలిపారు. ఎ.కోడూరులో శుక్రవారం 11 మంది బోదకాలు బాధితులకు టబ్, మగ్గు, టవల్, సబ్బు, ఆయిన్‌మెంట్‌తో కూడిన కిట్లను ఆయన అందజేశారు. ప్రతి రోజు బోదకాలును టబ్‌లో పెట్టి నీటితో శుభ్రం చేసిన తరువాత మందును కాలికి పూయాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజుల పాటు మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.